# అసమర్థుడి ప్రేయసి

(కథానిక)

ఊరితో సంబంధం లేకుండా ఉన్నది ఆ ఒక్క భవనమే "జ్యోతినిలయం" అనే అక్షరాలు ఆ భవనంమీద తళతళ మెరుస్తున్నాయి. కిటికీల కమర్చబడిన రంగురంగుల అద్దాలమీద సూర్యకిరణాలు పడుతుంటే అవి వింతగా మెరుస్తున్నాయి ఆ భవనం చాలా విశాలమైనది. కాని కలకలమంటూ తిరగటానికి ఆ యింట్లో యెవరూ లేరు. అందుకే అంత యెత్తు మేడ చిన్నబోయింది.

హాల్లో శకుంతల కూర్చుని ఏదో ఆలోచనలో నిమగ్నమైవుంది. గోడ గడియారం "టిక్కు-టిక్కు" మని కాలహరణాన్ని సూచిస్తోంది. శకుంతల ఒక్క నిట్టూర్పు విడిచింది. ఆ నిట్టూర్పులో ఎన్నో ఆవేదనలు, ఎన్నో సువాసనలు మిళితమై వున్నాయి ఆమె మనసు కళ్లెం తెగిన గుర్రంలా దారీ తెన్నూ లేకుండా దౌడుతీస్తోంది. అడుగుల చప్పుడు విని వీధి గుమ్మంవైపు చూచింది. పనిమనిషి వచ్చింది. దాని ముఖం నీరసంగా ఉంది.

"అమ్మగారూ! జొరమొచ్చిందండి. ఇయాళకి పని సెయ్యలేనండి. కళ్లు తిరుగుతున్నాయి" అన్నది దీనంగా పనిమనిషి

"సరే లే. వెళ్లు-నే తంటాలు పడతానులే" అన్నది శకుంతల. పనిమనిషి నీరసంగా అడుగులు వేసుకుంటూ వెళ్ళిపోయింది.

ఇంత జాలి తనలో ఎలావచ్చింది! అయిదేళ్ళ క్రితం పనిమనిషి ఇలాగంటే నానాచీవాట్లు పెట్టి రెండురోజులు నాగా కట్టేది! ఇదంతా తనకు గోపాలంవలన వచ్చింది.

శకుంతల గడియారంవంక చూచింది. నాలుగయింది. ఇంకా భర్త రావటానికి గంట పైవుంది. గడియారం ప్రక్కనే వ్రేలాడుతూన్న తండ్రి పటాన్ని చూడగానే శకుంతల ముఖవైఖరి మారింది. ఆమె హృదయం ఆందోళన పడింది. క్షణంలో రెండు నీటి బిందువులు చెంపమీదుగా జారాయి. తన తండ్రి కెంత దుఃఖం కలిగించింది! తనను పెంచి పెద్దచేసి తన కోసం సర్వస్వం త్యాగంచేసిన తండ్రియెడ ఎంత పరుషంగా ప్రవర్తించింది!

అయిదేళ్ల క్రితం—

శకుంతల ఫిజిక్స్ లేబరేటరీలో "కాపర్ వాల్టామీటర్"తో పని చేస్తోంది. ఆమె కెదురుగా గోపాలం అదే ఎక్స్‌పరిమెంటు చేస్తున్నాడు. శకుంతల అతన్ని మొదటినుండి కనిపెడుతూనే ఉంది. అతనంటే ఆమెకు జాలి పొంగుకొస్తుంది. కాలేజీ విద్యార్థులంటే ఏవగించుకునే శకుంతలకు అతనంటే అభిమానం కలిగింది. ఈ వింతభావం తనలో కలిగినందుకామెకు ఆశ్చర్యంగా ఉంది.

అతనెంత యత్నించినా ఆ ప్రాక్టికల్ చేయలేకపోయాడు. విశ్వ ప్రయత్నం చేసినా గాల్వనామీటర్‌లో కదలిక కనిపించలేదు. డిమాన్‌స్ట్రేటరు బయట ఎవరితోనో బాతాఖానీ కొడుతున్నాడు. అతనికి "తెలియలేదు-మళ్లీ చెప్పండి" అనడగటానికి సిగ్గు. ఈ విషయమామెకు బాగా తెలుసు.

"కనెక్షన్ తప్పుచేశారు. ఈ రాగి తీగలిలాగ కలపండి" అని కలిపి చూపించింది శకుంతల. అతను సిగ్గుపడుతూ అలాగే చేశాడు. గాల్వనామీటర్‌లో ముల్లు కదలింది.

శకుంతల తన పని చూసుకుంటోంది. బేంచ్‌లోని వాళ్ళంతా నవ్వటం చూచింది. అందరూ ఆమెను చూసే నవ్వుతున్నారు. శకుంతలకు ఒళ్ళు మండింది. తెలియనివాడికి చెబితే ఏం కొంపమునిగింది! "ఆ చవటమీదే దీనికి జాలి కలిగిందోయ్" అని నెమ్మదిగా ఒకడు మరొకడి చెవిలో ఊదాడు. శకుంతలకీ మాటలు వినిపించాయి. ముఖం చిట్లించింది.

ప్రాక్టికల్ ముగించుకుని బజారుకు బయలుదేరింది శకుంతల ఆమె ఇంగ్లీషు పుస్తకం

ఆర్. యం. చిదంబరం

కొనవలసుంది. ఆమె మెదడులో ఆలోచనలు మొదలవుతున్నాయి. గోపాలాన్ని అందరూ కాలేజీలో ఉడికిస్తారు. గోపాలం "ఇంతేనా మీ తెలివి" అన్నట్టుగా వాళ్ళకేసి చూసి నవ్వుతాడు. ఎవరెంత ఏడిపించినా అతను నవ్వుతూనే ఉంటాడు. అతని ప్రకృతి చిత్రంగా ఉంది.

"బ్రదర్! ఒక పావలా ఉంటే ఇయ్యవోయ్. ఈ రిక్షావాడికివ్వాలి. నా పర్సు ఎవరో చెక్కేశారు" ఆ మాటలు విని శకుంతల ఆశ్చర్యపడి చూసింది. ఆరె! అది గోపాలమే! ఓ రిక్షావాడు అతని కేసి గుడ్లు వురిమి చూస్తున్నాడు.

మిత్రుడు సమాధాన మిచ్చాడు. "పర్సు పారేసుకుంటే ఎలాగ? ఆపాటి లోక జ్ఞానం ఉండనక్కర్లేదూ? ఓరి పశువా,"

శకుంతలకు ఒళ్ళు మండింది. ఈ వెధవ నీతులు చెప్పకపోతే సాయం చేయకూడదూ? లేకపోతే తన దారిన తాను పోకూడదూ? "పశువా" అని నిందించినా కూడా గోపాలం నోరు మెదపలేదు. ఆమెకు మళ్ళీ అతనిమీద జాలి కలిగింది.

"ఇదిగోనండి" అని పావలా యిచ్చింది. గోపాలం దిగ్భ్రమతో అందుకుని రిక్షావాడికిచ్చాడు.

"మీరు చాలా సాయంచేశారు. ఎవరో పర్సు కొట్టేశారు. అందులో యాభై రూపాయలున్నాయి. ఎందరు స్నేహితులుంటే ఏం లాభం? ఆపదకందుకొనే వారొక్కరూ లేరు" అని కృతజ్ఞత కనబర్చాడు. "ఫరవాలేద"ని శకుంతల పుస్తకం కొనకుండా ఇంటి ముఖం పట్టింది. "అమాయకుడు, పర్సు పారేసుకున్నాడు" అనుకుంది శకుంతల.

మరునాడు ఉదయం-

శకుంతల ఏదో పుస్తకం చదువుకుంటోంది. ఏదో క్రొత్త కంఠస్వరం విని శకుంతల కిటికీ దగ్గరకు వచ్చింది. శకుంతల ఉన్న యింట్లోనే కాలేజీ లెక్చరరు ఒకాయనుంటున్నాడు!

"మా అబ్బాయి పట్టి వెర్రివాడండి. వాడు నా కొడుకని చెప్పుకోటానికూడా సిగ్గుగా ఉంది. ఏంచేస్తాను? కడుపుచీపి ఎక్కడకు పోతుంది? కాలేజీలో ప్రవేశపెడితేనయినా కొంత లోక జ్ఞానం వస్తుందేమోనని తీసుకొచ్చాను. మీరు కొంత శ్రమపడి వాడికి లోకజ్ఞానం కలుగ చెయ్యాలి. మీ మేలు మరచిపోను" "అతను గోపాలం తండ్ర"ని శకుంతల తెలిసికొంది.

"పెళ్ళి చేసెయ్యలేకపోయ్యారా? పెళ్ళామున్నా బుద్ధి చెబుతుంది" అన్నాడు చలోక్తిగా లెక్చరరు.

"అ .. అంత భాగ్యంకూడా. వీడిసంగతి అందరకూ తెలుసు ఇటువంటి చవటను కట్టుకుని ఏ పిల్ల అఘోరిస్తుంది? చాలా సంబంధాలొచ్చి తప్పిపోయాయి. కొంచెమన్నా లోకజ్ఞానముండొద్దూ? అథవా నేను కట్నం యిస్తానన్నా వాడినెవరూ కట్టుకోరు. వాడిరాత అంతే" అని నిట్టూర్చాడుతండ్రి ప్రొఫెసరు పకపకనవ్వాడు. శకుంతల ఇక వినలేక వచ్చేసింది. అతన్ని తిడితే తనకెందుకు బాధ?

గోపాలం ఆనాటినుండి అక్కడకు ప్రైవేటుకు వచ్చేవాడు. పోతపోసిన విగ్రహంలా కూర్చుని ప్రొఫెసరు చెప్పినదంతా వినటం— ఏదన్నా పని చేసుకుంటే అవకతవకలుగా చేయటం— ఇతని పని. శకుంతల అతన్ని కనిపెడుతూనే ఉంది అతను నిజంగా అమాయకుడనే నిశ్చయానికి వచ్చింది. ఎందుకో అతనిమీద జాలి కలుగుతోంది.

మరొకవారానికి-

శకుంతల సింగారించుకుంటోంది. ప్రొఫెసరు ఎవరినో మందలించటంవిని పరుగెత్తుకొని వచ్చి కిటికీదగ్గర నిలబడింది గోపాలం తలవంచుకుని నిలబడున్నాడు.

"ఆ సూరన్న ఎంతటి జిత్తులమారినక్కో తెలుసా? ఆ యింటిమీద నీ కెవడు పెత్తన మిచ్చాడు? డబ్బిచ్చేటప్పుడు నోటు రాయించుకోవాలని తెలీదూ? ఏమిటో వెర్రివేషాలు?" అని గదమాయించాడు ప్రొఫెసరు. శకుంతల తండ్రికూడా అక్కడకు వచ్చాడు.

"చూడండి శేషయ్యగారూ! ప్రొద్దున్నే కాలేజీకి పోతూ బీరువా తాళం చెవి దాచమని యిచ్చిపోయాను. ఆ సూరన్న ఆ దొంగ వెధవ వీడి అమాయకత్వం కనిపెట్టి తనకు చాలా ఇబ్బందిగా ఉందని లేనిపోని కారణాలు చెప్పి ఏడ్చి వంద రూపాయలిమ్మన్నా

డట వీడికోపళ్ళంగా జాలి పొంగుకొచ్చేసింది. తీసిచ్చేశాడు ఎవడికోసం సొమ్మనుకున్నాడో? మళ్ళీ వాడిస్తాడా ఆ సొమ్ము? ఫో .. పోయి నా సంద పట్టుకురా. ఎలా తెస్తావో నాకేం తెలియదు...నడు."

గోపాలం మాట్లాడకుండా బైటికి నడిచాడు.

"వీడికి లోకజ్ఞానం కలిగించమని వాళ్ళ బాబు నా కప్పగించాడు. చూస్తే నా తెలివి కూడా పోయేట్టుంది"

శకుంతల మనసు ఎందుకో ఆరాటపడింది. మళ్ళీ అంతరాత్మ ప్రశ్నించింది, "వాడిని తిడితే నీ సొమ్మేం పోయింది? నీకెందుకీ వ్యధ?" ఎంత వెదకినా దానికి సమాధానం దొరకలేదు.

"ఇదిగోనండి వంద రూపాయలు" అన్న గోపాలం మాట విని మళ్ళీ కిటికీ దగ్గరకు వచ్చింది శకుంతల.

"ఎలా తెచ్చావు?" అనడిగాడు ప్రొఫెసరు.

"సూరన్న యిచ్చాడు" అన్నాడు తలవంచుకుని గోపాలం.

ప్రొఫెసరు ఆశ్చర్యపోయాడు. నోటు వ్రాయించుకున్న వాళ్ళకే పంగనామాలు పెడతాడు సూరన్న!

శకుంతల నిట్టూర్పు విడిచింది. అతని అమాయక వదనం చూడగానే సూరన్నకు జాలి కలిగినట్లుంది. "అతన్ని భగవంతుడే రక్షిస్తాడు" అనుకుంది శకుంతల.

ఆనాటి సంఘటన శకుంతల కళ్ళకు కట్టినట్లు కనిపిస్తోంది ఆనాటినుండే శకుంతలకు గోపాలంమీద అభిమానం జాలి రెట్టించాయి. ఆమె సినిమాకు వెళ్ళింది. ఆమెకు నాలుగడుగుల దూరాన గోపాలం ఉన్నాడు. అతను పడుచులకోసం నాలుగువైపులా గాలించక తెరకేసే చూస్తున్నాడు. ఇంతలో—ఓ పద్దెనిమిదేళ్ల జవ్వని సయ్యారంగా యౌవనాన్నంతా వలకబోస్తూ అతని ప్రక్కనే అంగుళం ఎడంలో కూర్చుంది. గోపాలం ఇంకా తెరకేసే చూస్తున్నాడు. ఆ అమ్మాయి అతనితో సంభాషణ మొదలెట్టింది. గోపాలం ముక్తసరిగా మాట్లాడాడు ఆమె ఓరచూపులూ, పమిటె సర్దుకోటం ఇదంతా శకుంతల గమనిస్తూనే ఉంది. ఆమె పట్టణంలో పేరెన్నికగన్న వేశ్యకన్యని శకుంతలకు బాగా తెలుసు. "గోపాలం ఎలాగా అమాయకుడు. అతన్ని క్షణంలో వలలో వేసుకుంటుంది. మహామహా ధీరాలుకే ఆమెకు దాసోహమన్నారు" అనుకుంది శకుంతల. ఇటువంటి అమాయకులు లోకంలో జీవించటమెలాగ?

కాని ఆశ్చర్యం! గోపాలం ముఖం చిట్లించుకుంటూ ఆమెకేసి చురచుర చూసి దూరంగా ఉన్న మరొక కుర్చీలోపోయి కూర్చున్నాడు. తన ప్రయత్నం మొట్టమొదటిసారిగా విఫలమైనందుకు ఆ వేశ్య చిన్నబోయింది. శకుంతల హృదయంలో ఆనందం తాండవించింది గోపాలంలో మానవత్వం ఉంది, అతనులోకంలో బ్రతుకగలడు అనుకుంది.

శకుంతల ఈ ప్రపంచంలోనికి వచ్చింది. నాలుగున్నరయింది. గోపాలం రావటానికి ఇంకా అరగంట టైముంది. మళ్ళీ ఆలోచనలో నిమగ్నయయింది.

గోపాలంమీద ఆమెకు జాలి కలుగుతూనే వచ్చింది. ఇంటరు మొదటి సంవత్సరం పూర్తి కాగానే వాళ్ళనాన్న గోపాలాన్ని స్వగ్రామానికి తీసుకుపోటానికి వచ్చాడు. అతను రెండురోజుల్లో వెళ్ళిపోతాడు.

ఆమాట తండ్రితో ఎలా అనగలిగిందో ఈ నాటికీ శకుంతల కర్థం కావటంలేదు ఆ ఒక్కమాటే తనను, తండ్రిని దూరంచేసింది. శకుంతల పెళ్ళి ప్రయత్నాలుచేయ నారంభించాడు శేషయ్య. శకుంతల తాను గోపాలాన్నే పెళ్ళిచేసుకుంటానని తండ్రితో చెప్పింది. ఆమాటలు విని ముసలతను నివ్వెరపోయాడు.

"అతనిమీద నీకెలా ప్రేమ కలిగింది?" అనడిగాడు తండ్రి.

"ప్రేమకాదు. జాలి కలిగింది" అని సమాధాన మిచ్చింది శకుంతల.

"అమ్మాయ్! ఆ చవటను కట్టుకుని నువ్వేం సుఖమనుభవిస్తావు? ప్రతి విషయంలోనూ నీకు చింత తెచ్చిపెట్టి మనఃశాంతి లేకుండా చేస్తాడు. కన్నతండ్రికే వాడిమీద ప్రేమలేదు. పెడితే తినటంకూడా చేతకాని వెధవ." అని సద్బోధ చేశాడు.

"నాకు కలిగింది ప్రేమకాదు. జాలి. ఎలా

గయినా నే నతన్నే పెళ్ళి చేసుకుంటాను." అన్నది శకుంతల. గోపాలంమీద తనకు జాలి కలిగింది కాని ప్రేమ కలుగలేదని శకుంతల ఈ నాటికైనా అంటుంది.

ఆ సాయంత్రమే ముసలాడు గోపాలాన్ని పిలిచి "అబ్బాయి! బజారుకు వెళ్ళి ఓ మంచి పెన్ను కొనుక్కు రావాలి. మంచిది సుమా" అని పదిరూపాయల కాగితం గోపాలం చేతిలో పెట్టి పంపాడు. తండ్రి కూతుళ్లు అతని కోసం నిరీక్షిస్తూ కూర్చున్నారు. అరగంట పోయిన తరువాత గోపాలం వచ్చాడు.

"ఇదుగోనండి" అని పెన్ను ముసలాడి కందించాడు. శేషయ్య దానిని పరిశీలించాడు. ఎందుకూ పనికిరాని డొక్కు పెన్ను-పైకి డాబుగా ఉంది. అంతే—

"ఎంతకొన్నావు?"

"ఆరు రూపాయలకండి" అని నాలుగు రూపాయలు తిరిగిచ్చి గోపాలం వెళ్ళి పోయాడు.

"చూశావా! రూపాయి కూడా ఖరీదు చేయని వెధవ పెన్నుకు ఆరు రూపాయలు తగ లేశాడు. ఇటువంటి వాజమ్మతో నా నువ్వు కాపురం చేయటం?" అని ప్రశ్నించాడు తండ్రి. శకుంతల కిదేమీ రుచించలేదు. తన నిశ్చయాన్నే మళ్ళీ చెప్పింది. శేషయ్య మౌనం వహించాడు. అదే అంగీకారం—

వివాహం జరిగిపోయింది. అందరూ ముక్కు మీద వేలేసుకున్నారు. శేషయ్య కన్నీళ్లు వది లాడు. గోపాలం వరుడు కాకపోతే అవి ఆనంద బాష్పాలయ్యేవేమో!

"జ్యోతి నిలయం" పూర్తయింది. శకుంతల తండ్రి దగ్గరుండి అతి జాగ్రత్తతో ఆ భవనం కట్టించాడు తన సర్వస్వం అదే-బోలెడంత డబ్బు ఖర్చించాడు. ఆ చుట్టు ప్రక్కలెక్కడా కూడా అంత అందమైన భవనంలేదు. శేషయ్య ఒకనాడు శకుంతలను పిలిచి "ఈ భవనం నీ కోసం కట్టించాను. నా జీవితంలో నేను నీకు బహుకరించే దిదే. దీంట్లో మీరు హాయిగా ఉండండి" అన్నాడు

"నువ్వు నీ జీవితమే నాకు బహుకరించావు నాన్నా" అన్నది శకుంతల రుద్ధ కంఠంతో. తన వివాహమైనప్పటినుండి తండ్రి దుఃఖంతో కుమిలిపోతున్నాడని ఆమెకు తెలుసు. కాని తాను చేసిన పనికి ఆమె యెన్నడూ పశ్చాత్తాప పడలేదు. రాతి బాటను పూల బాటనుకుంది.

ఓనాడు శకుంతల, గోపాలం షికారుకు వెళ్ళి తిరిగివచ్చారు ఇంటి తలుపు తాళంవేసి ఉంది. వాళ్ళు ఆశ్చర్యపోయారు.

"మీ నాన్నగారు ఎక్కడికో వెళ్ళిపో యారు. ఇదిగో తాళంచెవి" అని తాళంచెవి అందించింది పనిమనిషి.

శకుంతలను ఏదో భయం పీడిస్తోంది. ఇంట్లోకి వెళ్ళింది. అంతా నిశ్శబ్దంగా భయాన కంగా ఉంది. బల్లమీద ఏదో ఉత్తరముంది. తీసి చదివింది.

చేతులు వణకుతున్నాయి. హృదయంమీద వజ్రఘాతం తగిలినట్లయింది.

"ఆ చవటతో నువ్వు కాపురం చేస్తూ ఆత్మశాంతి లేకుండా ఉండటం ఈ కళ్ళతో చూడలేను. కడుపు తీపి నన్ను తిన్నగా వుండ నియ్యదు. నా ఆశలు కూలిపోయాయి. నేను వెళ్ళిపోతున్నాను. నన్ను జీవితంలో కలుసుకో లేవు-కాని నీ శ్రేయస్సుకోసం దైవాన్ని ప్రార్థి స్తాను" అన్న మాటలు ఆమె హృదయాన్ని బాకుతో కెలికాయి.

గోపాలంతో తండ్రికోసం ఊరంతా వెది కింది. అన్ని ప్రయత్నాలూ చేసింది. కాని అంతా విఫలమైంది. అయినా శకుంతల తాను చేసిన పనికి పశ్చాత్తాపడలేదు. తండ్రి తనకు బహూకరించిన ఆ భవనంలోనే ఉంది. తండ్రి ఎక్కడున్నాడో! ఏంచేస్తున్నాడో!

గడియారం అయిదుగంటలు కొట్టింది.

శకుంతల చెంపలమీదుగా నీరు కారుతోంది. తుడుచుకుని వీధి గుమ్మందగ్గరకు వచ్చింది. గోపాలం చేతిలో బరువైన సంచీతో వచ్చాడు: సంచీ అందుకుంది. కూరగాయలన్నీ చూచింది.

"కుళ్ళిపోయినవి పుచ్చిపోయినవి చాలా ఉన్నాయి" అంది.

"చాలా శ్రమపడి ఏరుకుని వచ్చాను ఇంకా చెడిపోయినవున్నాయా?" అన్నా గోపాలం. అతని అమాయకత్వానికి శకుంతలకు నవ్వు వచ్చింది. అతన్ని చూచి జాలిపడింది.